## కాంగ్రెస్ అంటేనే మోసం




నా పేరు మీనాక్షి. మాది ముక్రా(కే). కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని చెప్పి మాట తప్పింది. ప్రజాపాలనలో రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. మా గ్రామం ఎంపిక కాకపోవడంతో రేషన్ కార్డు రాలే. అర్హులందరికీ పథకాలు అమలు చేస్తామని చెప్పి మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి మోసం చేసింది. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలి. జాబితాలో పేర్లు రాని వారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పుడు గణతంత్ర దినోత్సవం రోజు అందరికీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 31వ తేదీ తర్వాత అని ప్రకటించి మోసం చేస్తుంది. అప్పుడు కూడా ఇస్తదో మళ్లీ మోసం చేస్తదోనని భయంగా ఉంది. రైతులు, ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం చరిత్రలో బాగు పడలేదు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మేము ఓటేసినందుకు బాధపడుతున్నా. మళ్లీ పదేళ్ల క్రితం గోస అనుభవిస్తున్నాం. చాలా మంది నాలాంటి వాళ్లు నాలుగు పథకాలకు దరఖాస్తు చేసుకునప్పటికీ మా గ్రామం ఎంపిక కాలేదు. మేము రేషన్ బియ్యానికి అమడ దూరంలో ఉన్నాము. నమ్మించి మమ్మల్ని మోసం చేసింది. కేసీఆర్ సార్ చెప్పిన పథకాలే కాకుండా ప్రజలు ఏం అవసరముందో ముందే తెలుసుకుని ఇచ్చిన మనసు కేసీఆర్ సార్‌ది. **- నాంవాడె మీనాక్షి, ముక్రా(కే), ఇచ్చోడ**



## ఎదురు చూపులే..

# టింగ్ టింగ్ మెస్సేజీల్లేవ్..

మంచిర్యాల, జనవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ పథకాలు అమలు చేస్తున్న తీరుపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి పథకాలు అమలు చేస్తామని చెప్పిన సర్కారు.. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలోనే ఇస్తామంటూ మెలిక పెట్టింది. గణతంత్ర దినోత్సవాన అర్ధరాత్రి 12 గంటలకే రైతులకు రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. టింగ్.. టింగ్.. అని మీ ఫోన్‌లకు మెస్సేజీలు వస్తాయన్నారు. కానీ.. అవి మండలంలోని ఒక గ్రామానికే ఇస్తుండడంపై మిగిలిన గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఆ ఒక్క గ్రామంలోని వారికే ఇచ్చి మిగిలిన వారికి ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నిస్తున్నారు. ఆ ఒక్క ఊరిలో ఉన్న వారే రైతులా? మిగిలిన గ్రామాల వారు కాదా? అంటూ మండిపడుతున్నారు. గతంలో కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు సమయానికి పెట్టుబడి సాయం రైతుబంధు వచ్చేదని, అందరికీ ఒకేసారి టింగ్.. టింగ్ అంటూ రైతుబంధు మెస్సేజీలు వచ్చేవని చెప్తున్నారు. ఇప్పుడు రైతు భరోసా ఎప్పుడు పడుతుందా? అని ఎదురు చూడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. రైతు భరోసా ఇకనైనా రైతులందరికీ ఒకేసారి ఇవ్వాల్సిందంటున్నారు. సాగు పంటలు ఎన్ని ఎకరాలు, సాగులో లేని పంటలు ఎన్ని ఎకరాలో తేలకముందే ఆ గ్రామాల్లోని రైతులకు ఎలా వేశారో చెప్పాలంటున్నారు. గత ప్రభుత్వం తొలి రోజులు ఎకరం లోపు, రెండో రోజు రెండు ఎకరాల్లోపు అంటూ విడుతలవారీగా రైతులందరికీ రైతుబంధు వేసేదని, కాంగ్రెస్ సర్కారు కూడా అదే తరహాలో అందరికీ ఒకేసారి వేస్తే బాగుండేది అంటున్నారు.



## మండలానికో గ్రామమేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు పథకాలను ప్రారంభించింది. ఇదీ బాగానే ఉంది. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసం. నాకు నాలుగెకరాల భూమి ఉంది. భూమిని దున్నడానికి రూ.20 వేలు, విత్తనాలకు రూ.10 వేలు ఖర్చు అయింది. రైతు భరోసా వస్తుందనే నమ్మకంతోనే ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీపై డబ్బులు తీసుకువచ్చినా. ఇంత వరకు రుణమాఫీ, రైతు భరోసా రాలేదు. దీంతో నేను అప్పుల పాలయ్యా. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించింది. వీటిలో అర్హత సాధించిన లబ్ధిదారులకు గణతంత్ర దినోత్సవం రోజు ఇస్తామని చెప్పడంతో ఆశతో ఎదురు చూశాం. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యా. నాతోపాటు గ్రామంలో చాలా మంది రుణమాఫీ, రైతు భరోసా రాకపోవడంతో సాగు కోసం ప్రైవేట్, బ్యాంకులల్ల అప్పులు చేయాల్సి వస్తుంది. కేసీఆర్ సార్ ప్రభుత్వంల సీజన్ ప్రారంభానికి ముందే రైతుబంధు డబ్బులు ఖాతాలో పడేవి. మా గ్రామానికి కూడా నాలుగు పథకాలు అమలు చేయాలి.

**- లకే అశోక్, ముక్రా(కే), ఇచ్చోడ మండలం**

## రైతు భరోసా రైతులందరికీ ఒకేసారి ఎందుకివ్వరు?

- పైలెట్ గ్రామాల్లోనే ఇస్తే ఎలా? మిగిలిన వాళ్లం రైతులం కాదా?
- ఎంపిక చేసిన గ్రామాల్లోనూ అరకొరగానే పథకాల అమలు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై వెల్లువెత్తుతున్న జనాగ్రహం

## ఇందిరమ్మ ఇల్లు రాలే..



ఎలక్షన్ల ఇండ్లు ఇస్తం. పేదోళ్లకు రూ.12 వేలిస్తం. ఫింఛన్ రూ.4 వేలిస్తం.. ఇలా ఎన్నో చెప్పిండ్రు కాంగ్రెసోళ్లు. ఆశపడి ఓట్లేసినం. మాకు రేకుల ఇల్లుందని ఎట్లయినా ఇందిరమ్మ ఇల్లొస్తదని దరఖాస్తు చేసుకున్నా. తీరా చూసే సరికి పేదోళ్లమైన మాకే ఇల్లు రాలే. ఇల్లున్న వారికి ఇల్లచ్చింది. మాకు రాలేదని అడిగితే గప్‌చుప్ ఉండాలా. తర్వాత మీగ్గూడా వత్తదన్నారు. ఓట్లేసి మోసపోయినం. అన్ని చేస్తం పేదోళ్లను అన్ని విధాల ఆదుకుంటామని చెప్పి ఇప్పుడేమో మాట మార్చిండ్రు. మాకు న్యాయం చేయాలి. లేకుంటే రేవంత్‌రెడ్డికి మాలాంటి వారి ఉసురు తగుల్తది.

**- సమైకర్ రేణుకాబాయి, అంతర్ని, కుభీర్ మండలం**

## ఎంపిక చేసిన గ్రామాల్లోనూ అరకొరే..

మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి అందజేస్తామని చెప్పినప్పటికీ ఆ గ్రామాల్లోనూ పథకాల అమలు లోప భూయిష్టంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. సర్కారు నిర్వహించిన సర్వేలో సేకరించిన సమాచారం ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఆరు గ్యారెంటీల కోసం అమలు చేసుకున్న సమయంలో, మీ సేవల్లో చేసిన దరఖాస్తులేవీ పరిగణలోకి తీసుకోలేదని గ్రామ పంచాయతీ అధికారులు చెప్తున్నారు. దీంతో ఇల్లు లేని చాలా మందికి ఇందిరమ్మ ఇండ్లు కూడా రాకుండా పోయాయి. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇల్లు లేని పేదలకు ఇంకా న్యాయం జరగలేదని తెలుస్తున్నది. రేషన్ కార్డుల విషయంలోనూ ఇదే జరిగిందని అధికారులు అంటున్నారు. మొన్న గ్రామసభల్లో ఇచ్చిన దరఖాస్తుల పరిశీలినకు ఇంకా సమయం పడుతుందని, వారికి వస్తాయో? రావో? అన్న దానిపై తమకే స్పష్టత లేదని చెప్తున్నారు. ఆత్మీయ భరోసా విషయంలో పట్టణ ప్రాంతాల్లోని ఉపాధి హామీ కూలీలకు సర్కారు మొండిచేయి చూపించి నట్లు తెలుస్తున్నది. గ్రామంలో ఉపాధి కూలీలు చాలా మంది ఉంటే ఏడాదికి 20 రోజుల పని దినాలు ఉన్న వారికే ఇస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. పథకాలు ఇచ్చిన సర్కారు మండలానికి ఒక్క గ్రామానికే కాకుండా, అర్హులందరికీ ఒకే సారి ఇవ్వాలని జనాలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రైతుభరోసా విషయంలో రైతులందరూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ దిగిపోయేదాక ఏ పథకాలు రావు



మండలంలోని ఒక్క ఊరికే పథకాలు ఇస్తున్నరట. మేమేం పాపం చేసినం. ఇస్తే అందరికీ ఇయ్యాలి. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులు ఎన్నడు ఇబ్బంది పడలే. రాష్ట్రంల ఉన్న రైతులందరికీ ఒకేసారి రైతుబంధు సాయం బ్యాంకుల జమ అయ్యేది. రేవంత్‌రెడ్డి పూటకో మాట చెప్పి మోసం చేస్తున్నడు. మూడు రోజుల కింద ఈ అర్ధరాత్రి సంది రైతు బ్యాంకులల్ల రైతుభరోసా పైసలు జమ అయితయ్ అని చెప్పిండు. నాకు డబ్బులు జమ అయినయేమోనని రెండు రోజులుగా బ్యాంకు సుట్టూ తిరుగుతున్న. నాకు మాదాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ఖాత ఉన్నది. బ్యాంకు సార్లను పైసలు పడ్డయా? అని అడిగితే మార్చి నెలాఖరు దాక ఎప్పుడన్నా పడచ్చని చెప్పిండ్రు. పంట కాలం సగం అయిపోయినంక పైసలస్తే ఏం లాభం. అందరికీ కేసీఆర్ సార్ ప్రభుత్వమే మంచిగుండే. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయేదాక ఏ పథకాలు రావు. అన్నీ ఉత్త మాటలే. దరఖాస్తు ఫారాలకు, జిరాక్సు కాపీలకు పైసలు దండగయితున్నయ్.

**- రేని లింగన్న, రైతు, కొౌట్ల(కే), నిర్మల్ రూరల్ మండలం**



▲ నాగోబా మహాపూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికారులు, మెస్రం వంశీయులు

# వైభవంగా నాగోబా

- మహాపూజతో ప్రారంభమైన జాతర
- ప్రత్యేక పూజలు చేసిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 28 : కేస్లాపూర్‌లో నాగోబా ఉత్సవాలు మంగళవారం అర్ధరాత్రి సంప్రదాయ పద్ధతిలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నాగోబాకు మహాపూజ నిర్వహించేందుకు మెస్రం వంశీయులు ఉదయం 11గంటలకు శ్రీకారం చుట్టి.. రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. జాతర అధికారికంగా 28 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. మహాపూజకు ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది మెస్రం వంశీయులు, ఆదివాసులు తరలిరావడంతో నాగోబా ఆలయం కిక్కిరిసింది. కేస్లాపూర్‌లోని పురాతన(మురాడి) నాగోబా విగ్రహంతో మెస్రం వంశీయులు భాజా భజంత్రీలతో ఆలయానికి చేరుకున్నారు. ముందుగా మైసమ్మ దేవతకు పూజలు నిర్వహించి ఆలయంలోకి ప్రవేశించారు. పురాతన విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఏర్పాటు చేసి, నాగోబా దేవత, సతీదేవత, బాన్‌దేవత, పుర్సపేన్ దేవతకు సంప్రదాయ పూజలు చేసి దర్శించుకున్నారు.

### 22 కితలకు చెందిన మహిళలకు కుండల పంపిణీ

నాగోబా ఆలయంలో భద్రపర్చిన మట్టికుండలను 22 కితలకు చెందిన మహిళలకు మెస్రం వంశీయుల పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముందుగా మట్టికుండలకు కటోడ కోసేరావ్, కోసు కటోడ ప్రత్యేక పూజలు చేశారు. 22 కితలకు చెందిన మహిళలు మట్టి కుండలతో మర్రిచెట్ల వద్ద ఉన్న నీటి కోనేరుకు చేరుకోవడంతో మెస్రం వంశీయుల అల్లుళ్లు నీటి కోనేరు ద్వారా నీటిని తోడి మట్టికుండల్లో నింపారు. మహిళలు మట్టికుండలను తలపై పెట్టుకుని నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలోని పాత పాముల పుట్టలను అల్లుళ్లు తవ్వి తొలగించి ఆదేమట్టిని బురదమట్టిగా చేసిచ్చారు. మహిళలందరూ కలిసి ఆ మట్టితో పాముల పుట్టలతోపాటు మరికొంత మహిళలు ఆలయంలో బౌలదేవతను తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బౌలదేవత పూజల్లో పాల్గొన్న మహిళలకు మెస్రం వంశీయులకు నాగోబా చరిత్రను మెస్రం గంగారాం, రాము కిక్రి వాయిస్తూ పాటల ద్వారా వివరించారు.

### గోవాడ్‌లో మహిళలకు ప్రవేశం

మర్రిచెట్ల నుంచి ఎడ్లబండ్లతో కుటుంబ సమేతంగా గోవాడ్ ప్రాంతానికి వచ్చిన మెస్రం వంశీయులు మహిళలను గోవాడ్‌లో ప్రవేశం కల్పించి, గోవాడ్ చుట్టూ ప్రాంతంలో ఎడ్లబండ్లను వదిలి ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకుని బస చేస్తున్నారు. గోవాడ్‌లో మహిళలు 22 ప్రత్యేక పొయ్యిలను ఏర్పాటు చేసుకుని మహాపూజకు అవసరమైన నైవేద్యాన్ని సామూహికంగా తయారు చేస్తున్నారు. మహాపూజలకు ముందుగా నాగోబా ఆలయాన్ని మెస్రం వంశీయులు గంగాజలంతో శుద్ధి చేశారు. రాత్రి 10 గంటల తర్వాత మెస్రం వంశీయులు గోవాడ్ నుంచి వెలిగించిన కాగడాలతోపాటు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నాగోబా ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో నాగోబాకు మహాపూజలు నిర్వహించేటప్పుడు ఇతరులను లోనికి రానివ్వకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మెస్రం వంశీయులే నాగోబాకు మహాపూజలు నిర్వహించారు. మెస్రం వంశీయుల మహాపూజల అనంతరం వచ్చిన ప్రముఖుల తోపాటు అతిథులు, ఇతరులకు నాగోబాకు పూజలు చేసేందుకు అవకాశం కాల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్ అలం, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఉట్నూర్ ఏఎస్పీ ఖాజల్ సింగ్, ఖమ్మం వెరిటికల్ ఐటీ సెల్ వెంకటేశ్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయా, డీఎఫ్‌వో బాజీరావు ప్రశాంత్ పాటిల్, ఆదిలాబాద్ ఏఎస్పీ సురేందర్‌రావు, సీఐ మొగిలి, ఎస్ఐ సునీల్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.



కోనేరు నుంచి మట్టికుండలతో నీళ్లు తీసుకోస్తున్న మెస్రం వంశీయుల మహిళలు

# రోడ్ల నిర్మాణానికి రూ.15.30 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషితో గ్రామీణ రోడ్లకు మహర్దశ
- ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

నేరడిగొండ, జనవరి 28 : నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి రూ.15.30 కోట్లు మంజూరైనట్లు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తెలిపారు. నియోజకవర్గంలో ఆరు గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. వీటిని పంచాయతీరాజ్ శాఖ రూరల్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా బీటీ రెన్యూవల్ పనులు ఎంఆర్ఆర్ గ్రాంట్స్ ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో నియోజకవర్గంలో చాలా గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేదని వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రజలు రోడ్డు సౌకర్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందులో గుడిహత్నూర్ మండలంలోని కామగిరి నుంచి సుంకిడి వయా బెల్లెరి తేజాపూర్ వరకు రూ.7.50 కోట్లు, నేరడిగొండ మండలంలోని నేషనల్ హైవే నుంచి బోరిగాం వరకు 4 కిలో మీటర్లకు రూ.2.60 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి చిన్న బుగ్గారం వరకు 1 కిలోమీటర్ రూ.65 లక్షలు, నేషనల్ హైవే నుంచి తర్నం(కె) గ్రామం వరకు 3 కి.మీ. రూ.1.95 కోట్లు, బోథ్ మండలంలోని ఆర్‌బీ రోడ్డు నుంచి పొచ్చెర గ్రామం వరకు 1 కి.మీ. 65 లక్షలు, పీఆర్ రోడ్డు నుంచి గొల్లాపూర్(వి) వరకు 3 కి.మీ. రూ.1.95 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చేసిన ఎనలేని కృషితో ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయండి

ఎదులాపురం, జనవరి 28 : పని చేసే ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురైతే.. ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు అండగా ఉంటామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు తెలిపారు. మంగళవారం డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో కోర్టు అధికారులు, సిబ్బందికి పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధక నివారణ పరిష్కార చట్టంపై అవగాహన కల్పించారు. ప్రభాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టంపై అవగాహన కల్పించడానికే సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. సమావేశంలో న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్



కలెక్టరేట్ ఎదుట కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

ఎదులాపురం, జనవరి 28 : రాజ్యాంగాన్ని సవరించే కుట్రల్లో భాగామే దళితులు, దళిత మేధావులు, బహుజనులపై బీజేపీ నాయకులు దాడులతోపాటు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ ఆరోపించారు. యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. యుద్ధనౌక గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు ఇవ్వమని బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మాల సంక్షేమ సంఘం నాయకులు మల్లన్న, సుధీర్, రాఘవేంద్ర, నరేందర్, రఘు, లక్ష్మణ్, సుభాష్, స్వామి, రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రామన్న

# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

బేల, జనవరి 28 : సాంగిడి గ్రామానికి చెందిన పలు కుటుంబాలను మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు మాజీ ఎంపీటీసీ విటోబా బోసలే ప్రమాదానికి గురయ్యాడు. అలాగే విటోబా గోపాతి, గుంజరి నేగరి, బెదుడ్కర్ మిలిన్, రాంకిషన్ కుటుంబాలను పరామర్శించారు. వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు ప్రమోద్‌రెడ్డి, గంభీర్ ఠాక్రే, సతీశ్ పవర్, సుదర్శన్, గంగన్న, తన్వీర్ ఖాన్ పాల్గొన్నారు.

# గెలిస్తే సంతోషపడొద్దు.. ఓడితే బాధపడొద్దు

- సరదాగా ఆటల పోటీల్లో పాల్గొనాలి..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 28 : పోటీల్లో క్రీడాకారులు గెలిచిన సంతోష పడొద్దు.. ఓడిన బాధపడొద్దని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 19 వసతి గృహాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయంత్రం ముఖ్యఅతిథిగా పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. 250 మంది విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్యారమ్, చెస్, రన్నింగ్ 190 మీటర్లు, స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని మొదటి, రెండో బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీవో సునీత కుమారి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఏఎస్‌డబ్ల్యూవోలు నారాయణ రెడ్డి, నర్సింగ్, వసతి సంక్షేమ అధికారులు లింగంపల్లి దత్తు, శ్యాంసుందర్, శ్రీనివాస్, విఠల్, సురేందర్, రాధ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కప్ అందజేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా